నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మే 13, 2024 | www.navatelangana.com

ఆదమరిస్తే అంతే


రోడ్డు పక్కన గుంతగా మారిన దృశ్యం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో పై ఓవర్‌బ్రిడ్జి సమీపంలోని బ్రిడ్జి వద్ద వర్షానికి మట్టి కొట్టుకపోయింది. అది ఏర్పడకుండా మారింది. ద్విచక్ర వాహన దారులు ఆదమరిస్తే పెనుప్రమాదం పొంచి ఉంది. జాతీయ రహదారి గూండ వేల మంది ప్రతి రోజు ప్రయాణం చేస్తుంటారు. బ్రిడ్జి వద్ద ఎటువంటి ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కాంట్రాక్టర్లు వాటిని పట్టించుకున్న పాపనపోలేదు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

నవతెలంగాణ- రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన కట్ట బాబు భార్య కాపురానికి రావడం లేదని రథాల గైన్‌లోని వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించగా, గమనించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది సహకారంతో సురక్షితంగా కిందికి దించారు. సాహసం చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను ప్రజలు అభినందించారు. సంఘటనలో ఎస్సై విజయ్ కొండ, పోలీస్ సిబ్బంది రంజిత్‌రెడ్డి, మురళి మోహన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.


బాబును కాపాడిన పోలీస్

రండి ఓటేద్దాం..




ఈవిఎంలతో బయలుదేరిన ఎన్నికల సిబ్బంది

- బాధ్యతగా ఓటేసి ప్రజాస్వామ్య స్ఫూర్తి చాటుదాం
- నేడే లోక్‌సభ ఎన్నికల పోలింగ్
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి, అధికారులు
- ఓటింగ్‌శాతంపై సర్వత్రా ఉత్కంఠ



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నేడు(సోమవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. వేసవి నేపథ్యంలో సాయంత్రం వేళ అదనంగా గంట సమయం కేటాయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సామగ్రి, అధికారులు, సిబ్బంది ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. అయితే ఈ సారి పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. పోలింగ్ శాతంపై అభ్యర్థులు సైతం ఆసక్తిగా గమనిస్తున్నారు.

లోకసభ ఎన్నికల చివరి ఘట్టం పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గత కొన్ని రోజులుగా సాగిన ప్రచారం ముగియగా.. అందరి చూపు పోలింగ్‌పై పడింది. నిజామాబాద్ లోక్‌సభ బరిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ నుంచి ధర్మపురి అరవింద్ బరిలో నిలిచారు. అదే విధంగా జహీరాబాద్ స్థానానికి కాంగ్రెస్ సురేశ్ షెట్కార్, బీఆర్‌ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీపాటిల్ పోటీ చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 6,80,921 మంది ఓటర్లు ఉండగా.. వారి కోసం 791 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 64 సమస్యాత్మక లొకేషన్లను గుర్తించి 64 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు.కామారెడ్డి, మద్నూర్, ఎల్లారెడీ లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి ఆదివారం పోలింగ్ బందాలు ఈవీఎం లు, పోలింగ్ సామాగ్రితో ఆయా నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు నిర్దేశించిన రూట్లలో సిబ్బంది, అధికారులు తరలివెళ్లారు.

కామారెడ్డిలో 27 రూట్ల ద్వారా 27 బస్సులలో, జుక్కల్ లో 26 రూట్ల ద్వారా , యెల్లారెడ్డి లో 29 రూట్ల ద్వారా బస్సులలో పోలింగ్ బందాలు తరలివెళ్లినట్టు కలెక్టర్ తెలిపారు.


డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది

నేటి రాత్రికే పోలింగ్ కేంద్రాలలో సరిగ్గా వెలుతురూ ఉండేలా కంపార్ట్మెంట్, సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏ చిన్న సంఘటనకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు . పోలింగ్ అనంతరం చెక్ లిస్ట్ ప్రకారం ఈవీఎం లను, ఇతర మెటీరియల్స్ ను రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలని , వాటిని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని అధికారులకు సూచించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ కౌంటింగ్ హాల్ స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్ల తరలింపు కాగా, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూం కు ఆదివారం తరలించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్వీయ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల నుండి వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను ముందుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని స్ట్రాంగ్ రూంలో భద్రపర్చగా, వాటిని పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రత్యేక కంటైనర్ వాహనంలో ఆదివారం కౌంటింగ్ సెంటర్ స్ట్రాంగ్ రూం కు చేర్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ తో పాటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్లను జాగ్రత్తగా భద్రపర్చి, స్ట్రాంగ్ రూంకు సీల్ వేశారు.

వైద్య శాఖలో

లైంగికవేధింపుల పర్వం

- డీఎంఅండ్‌హెచ్‌వో ఘటన మరవకముందే మరో వేధింపు
- కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ వేధిస్తున్నట్టు
- మహిళా వైద్యురాలి ఫిర్యాదు
- మహిళా ఉద్యోగులకు రక్షణేది..?
- ఎన్నికల విధుల్లో ఉన్నతాధికారులు బిజీ



నవతెలంగాణ-రామారెడ్డి

వైద్యశాఖలో లైంగికవేధింపుల పర్వం చర్చనీయాంశంగా మారుతోంది. డీఎంఅండ్‌హెచ్‌వో తమను తాకుతూ, వ్యక్తిగత విషయాలు ఆరా తీస్తూ, వ్యక్తిగతంగా ఫోన్ చేస్తూ మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నట్టు జిల్లాలోని మహిళా వైద్యులు ఈ నెల 8వ తేదీనా ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ ఘటన మరవకముందే డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ వేధిస్తున్నట్టు ఓ మహిళా వైద్యులురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. అసలు వైద్య శాఖలో ఏం జరుగుతోందన్న చర్చ నెలకొంది. అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని మహిళా ఉద్యోగుల పట్ల వేధింపులు రోజురోజుకూ వెలుగుజూస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు ఇలా వేధింపులకు గురి చేస్తుంటే కిందిస్థాయి మహిళా వైద్యులు, సిబ్బంది తీవ్ర మానసిక వేధనకు గురవుతున్నారు. విధులు సరిగ్గా నిర్వహించలేకపోతున్నారు.

వైద్య శాఖలో మహిళా వైద్యుల పట్ల లైంగిక వేధింపులు వెలుగుజూస్తున్నాయి. జిల్లా వైద్యాధికారి కార్యాలయం సూపరింటెండెంట్ ఏ శ్రీనివాస్ జిల్లాలోని ఓ పిహెచ్‌సి వైద్యురాలిగా పని చేసిన మహిళా వైద్యురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు చేయడానికి కూడా ఆమె భయపడడంతో, తోటి వైద్యులు ధైర్యం చెప్పడంతో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం కార్యాలయంలో అడ్మినిస్ట్రేటీవ్ డిపార్ట్‌మెంట్‌లో పని

'నాకూ పెండ్లయింది'

సదరు సూపరింటెండెంట్ బాధిత మహిళా వైద్యురాలితో చేసిన వాట్సప్ చాట్ బయటకు వచ్చింది. 'మీరంటే నాకు చాలా ఇష్టం. చాలా రోజుల నుంచి చెబుదామనుకుంటున్నా కానీ ధైర్యం చాలలేదు. ఇష్టం లేకుంటే ఇగ్నోర్ చేయండి' అంటూ మెసేజ్ పంపడం గమనార్హం. దీనికి బాధితురాలు తనకు ఇది వరకే పెండ్లయి ఒక పాప ఉందని చెప్పగా.. తనకూ పెండ్లయిందని, ఇద్దరు పాపలు ఒక బాబు ఉన్నట్టు చెప్పడం గమనార్హం. ఆఫీస్‌కు వచ్చినప్పుడు కండ్లు చూసి ఇష్టపడ్డట్టు వేధిస్తుండటం గమనార్హం.

చేస్తుండటంతో వేధింపులు మరింత ఎక్కువ అయినట్టు సదరు వైద్యురాలు వాపోయారు. మొదట్లో ఘటనను తేలికగా తీసుకున్నానని, రోజురోజుకు వేధింపులు ఎక్కువ అవ్వటంతో, వృత్తిపరమైన గౌరవానికి బాధగా మారిందని వాపోయారు. మహిళా ఉద్యోగుల రక్షణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళా ఉద్యోగులకు రక్షణేది..?

వైద్య శాఖలో మహిళా వైద్యులకు, సిబ్బందికి రక్షణ కరువైంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళల పట్ల ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ఘటనలు ఒక్కోటి వెలుగుజూస్తున్నాయి. ఇంకా వెలుగు జూడని ఘటనలు ఎన్నో. తమ ఉద్యోగం ఎక్కడ కోల్పోతామో అని బయపడుతూ ఫిర్యాదు చేయని వారు ఇంకెందరో. పని చేసే ప్రదేశంలో సైతం మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

డీఎంఅండ్‌హెచ్‌వోపై విచారణకు ఆదేశాలు

డి ఎం అండ్ హెచ్ ఓ పై లైంగిక వేధింపు ఆరోపణలపై వైద్యశాఖ విచారణకు ఆదేశించి, విచారణ అధికారిగా డాక్టర్ జి అమర్ సింగ్ నాయక్ ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15వ తేదీ డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జిల్లాలోని పి హెచ్ సి మహిళ వైద్యులు, డిఎంఅండ్హెచ్వో లో పనిచేస్తున్న ఇతర అధికారులు సంబంధిత ఆధారాలతో విచారణ అధికారి ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.

బాధ్యతాయుతంగా ఓటేద్దాం

- కలెక్టర్‌ల పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

ఓటింగ్ జరిగే రోజు సెలవు దినం కాదని మనందరి ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే ఒక అపూర్వమైన రోజు అని ప్రతి ఒక్క రు గుర్తెరిగి బాధ్యతాయుతంగా వంద శాతం ఓటు వేసి తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని తద్వారా ఆదర్శవంతమైన సమా జాన్ని నిర్మించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతు, కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ విజ్ఞప్తి చేశారు.

సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఓటర్లు తమ ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం సంఘం సూచించన 12 రకాల గుర్తింపు కార్డులో ఏదో ఒకటి వెంట తేవాలని, మొబైల్స్ అనుమతి లేదని స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లాలో 516 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా నియోజక వర్గం వారీగా పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్

పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం సందర్శించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి డిచ్పల్లి సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్

ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపా యాలను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఏ.పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎం ల పనితీరును ప్రయోగాత్మకం గా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహ ణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిం చే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహ నాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దష్టికి తేవాలని సహాయ ఏఆర్‌ఓలకు సూచించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.


నిజామాబాద్ సిటీ: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



కామారెడ్డి: మాట్లాడుతున్న అధికారులు

ముంచెత్తిన వర్షం

- ఈదురుగాలుల ధాటికి అతలాకుతలం
- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం
- ఉక్కపోత నుంచి ఉపశమనం

నవతెలంగాణ-లింగంపేట్/నాగిరెడ్డిపేట్/గాంధారి

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆదివారం పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దవగా.. ఈదురుగాలుల ధాటికి గాంధారి మండలంలో రేకుల షెడ్డు కొట్టుకుపోయింది.

లింగంపేట్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలోని మోతే ముస్తాపూర్ మంభోజిపేట భవానిపేట్ పోల్కంపేట్, కన్నాపూర్, కోమటిపల్లి, పోతాయిపల్లి, తదితర గ్రామాలు భారీ వర్షం కురిసింది. పోల్కంపేట్, కన్నాపూర్ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు వర్షంతో ధాన్యం పూర్తి తడిసిపోయింది. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తరలించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే ఈ వేసవికాలంలో విపరీతమైన ఎండలు రావడంతో ప్రజలు ఉక్కపోతకు వడగాలుకు ఇబ్బంది పడ్డారు. ఆదివారం కురిసిన వర్షానికి కాస్త చల్లదనంతో ఊపిరి పీల్చుకున్నారు.


గాంధారి: వర్షానికి కూలిపోయిన షెడ్డు

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఆదివారం భారీగా వర్షం కురిసింది. ఒక్కసారిగా విపరీతమైన గాలి వడగండ్లతో భారీ వర్షం కురవడంతో వీధులన్ని జలమయమయ్యాయి. విద్యుత్ వైర్లపై పిడుగులు పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో వాతావరణమంతా చల్లబడింది.


గాంధారి: వర్షానికి కూలిన గడ్డివాము

గాంధారి : మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో వరి మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే ఈదురు గాలులకు నివాస గుడిసెలు రేకుల షెడ్లు లేచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

రామారెడ్డి : మండలంలో ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి, రాజమ్మ తండాలో పెద్ద శబ్దాలతో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో తండావాసులు ఉలిక్కిపడ్డారు. చెట్టుపై మంటలు చెలరేగాయి.


కొబ్బరి చెట్టుపైన పిడుగు పడిన దృశ్యం

వర్ష బీభత్సం - తడిసిన వరి ధాన్యం

నవతెలంగాణ-మెండోర

మండలంలో ఆదివారం సాయంత్రం గాలి దుమారంతో పాటు మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. వర్షపు నీరు ధాన్యం రాశుల కిందకు చేరింది. ఎలాగైనా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి తమని ఆదుకోవాలని రైతులు కోరారు. అకాల వర్షానికి నోటిదాక వచ్చిన వరి ధాన్యం తడిసి పోయివడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. అకాల వర్షం కారణంగా కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో తడిసిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. రైతులు ఎంత చైతన్యవంతులైన ప్రకృతి వైపరీత్యాలకు చిక్కకుండా ఎత్తుగడలు వేస్తూ పంటలు సాగుచేసిన వరుణదేవుడు కన్నెర్ర చేయడంతో రైతాంగానికి నష్టాలు కష్టాలు చూడటం తప్పడం లేదు. రాత్రి కురిసిన వర్షానికి రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు. తడిసి ముద్దయిన ధాన్యం చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.


వర్షానికి తడిసిన ధాన్యం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
సోమవారం | మే 13, 2024 | www.navatelangana.com

నరసింహుని జయంతి ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ - భీంగల్



భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని పురాతన శ్రీ లక్ష్మీ నృసింహుని ఆలయంలో సోమవారం నుండి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. నృసింహుని జయంతి సందర్భంగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామదేవత, క్షేత్ర దేవి పెద్దంగంటి ఎల్లమ్మ తల్లికి శ్రీ లింబాద్రి నరసింహ స్వామి వారి శేష వస్త్రాలు, సారె సమర్పించారు. మేళా తాళాలు, మంగళ వాయిద్యాలతో పెద్దంగంటి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, శేష వస్త్రాలు సమర్పించారు.

పట్టణంలో స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం 45 వారానికి చేరింది. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి రోడ్డు నెంబర్ 4లో ఉన్న ఉద్యానంలో అడ్డదిడ్డంగా పెరిగి రోడ్డు పైకి వచ్చిన చెట్ల కొమ్మలను కట్టర్ తో కత్తిరించారు. ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించారు. వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని ఒకచోట కుప్పగా పోసి నిప్పంటించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఓటు వేసిన వారికే ప్రభుత్వాన్ని ప్రశ్నించి, అభివృద్ధి చేసుకునే అధికారం వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కాలనీ పెద్దలు కుమార్, ఎర్ర భూమయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు

ఎస్ఐ రాజశేఖర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నేడు జరిగే పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల నాయకులకు, ప్రజలకు, ముఖ్యంగా యువతకు కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున ఎలక్షన్ కమిషన్ గైడ్ లైన్స్ ప్రకారం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని, దాని ప్రకారం నియమాలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 6గంటల నుండి 14వ తేదీ ఉదయం 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కావున ఐదుగురు అంత కంటే ఎక్కువగా వ్యక్తులు గుమిగూడి ఉండకూడదని పేర్కొన్నారు. పోలింగ్ డే రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ పార్టీకి చెందిన వారైనా కూడా 200 మీటర్ల లైన్ బయట కానీ, ఇంకా ఎక్కడ కూడా టెంట్లు వేయరాదని తెలిపారు. కేవలం ఒక టేబుల్ రెండుచైర్లు, గొడుగులు మాత్రం వేసుకోవచ్చని తెలిపారు. పార్టీ గుర్తులు, పార్టీ కండువాలు, పార్టీ టోపీలు ధరించి ఉండరాదని పేర్కొన్నారు. బాల్కొండ నియోజక వర్గం కాకుండా ఇతర నియోజకవర్గాలకి చెందిన వ్యక్తులు కమ్మర్ పల్లి మండలంలో ఉండడం నిషేధమని తెలిపారు. ఫంక్షన్ హాల్స్‌లో, కమ్యూనిటీ హాళ్లలో, గెస్ట్ హౌస్ లలో ఇతర నియోజకవర్గ ప్రజలను ఉంచరాదని సూచించారు. వైన్ షాప్స్, కల్లు దుకాణాలు మూసి ఉంచాలని, పోలింగ్ స్టేషన్ (పోలింగ్ బూత్) నుండి 200 మీటర్స్ దూరం లోపల గల ఇండ్లలో ఆ ఇంటి వారు తప్ప ఇతరులు ఉండకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ డే నాడు పోలింగ్ స్టేషన్(పోలింగ్ బూత్) లోనికి మొబైల్ ఫోన్లు, వాటర్ బాటిల్ లకి అనుమతి లేదని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేసే వారు మొబైల్ ఫోన్‌ని తీసుకొని రాకూడదని తెలిప్నారు. టెంట్ హౌస్ ఓనర్లు ఎవరు కూడా ఏ రాజకీయ పార్టీల వారికీ కూడా పోల్ డే రోజున పోలింగ్ బూతుల బయట వేయడానికి టెంట్లు అద్దెకు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పై నిబంధనలు ఎవరైనా అతిక్రమించినా చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత



పోలింగ్‌కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో సోమవారం జరగనున్న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ కోసం అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రితో ఎన్నికల సిబ్బంది బందోబస్తు మధ్య మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల సామాగ్రిని గదిలో ఉంచి వాటికి పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు.కాగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓటర్లు ఎండలో నిలబడి అలసిపోకుండా ఉండేందుకు నీడ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లను ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



మోడల్ పోలింగ్ స్టేషన్

నవతెలంగాణ-కోటగిరి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో 24 పోలింగ్ కేంద్రాలలో 18, 826 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికారులు ప్రత్యేకమైన ఏర్పాటు చేశారు. మోడల్, మహిళ, వికలాంగ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణయంగా తీర్చిదిద్దారు. 144 సెక్షన్ పోలింగ్ కేంద్రాల వద్ద అమలులో ఉంటుందని ఎస్ఐ సందీప్ తెలిపారు



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

మెండోర: మండలంలో పోలింగ్‌కు ఎన్నికల అధికారులుసర్వం సిద్ధం చేశారు.మండల వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానుండగా ఆదివారం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 12 నుండి 15 మంది సిబ్బంది చొప్పున దాదాపుగా 345 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించి పోలీసులు భారీ భద్రతను కల్పించారు. సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని 6 గంటల లోపు పోలింగ్ కేంద్రాల లోపల ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

గల్ఫ్ బోర్డుకోసం ఎదురుచూపులు

జిల్లాలో 2లక్షలకు పైగా గల్ఫ్ కార్మికులు

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వారి కష్టాలు తీరేనా

నవతెలంగాణ-ఆర్మూర్



కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటుచేయాలని వలస కార్మికులు పట్టుబడుతున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు వారి కుటుంబాలకు ప్రత్యేక పథకాలు అందించడానికి గల్ఫ్ బోర్డు ఏర్పాటు ఒక్కటే మార్గమనే అభిప్రాయాన్ని వలస కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో కార్మికుల కోసం ఇప్పటివరకు ప్రత్యేక కార్యాచరణ ఏది లేకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నాయి. ఎన్ఆర్ఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వలస కార్మికులకు ఎన్నో రకాల సంక్షేమ పునరావాస పునరీకరణ అమలు చేస్తుంది.

తెలంగాణ రాష్ట్రం నుండి.....

తెలంగాణ రాష్ట్రం నుండి దాదాపుగా 15 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ప్రతినెల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని వలస కార్మికులు మన దేశానికి చేరవేస్తున్నారు. విదేశాలకు వలస వెళ్లిన వారిలో ఎక్కువ ఆదాయం సమకూరుస్తుంది గల్ఫ్ వలస కార్మికులే కావడం విశేషం.. కరోనా విపత్కర పరిస్థితుల నుంచి బయటపడిన తర్వాత వలసలు పెరగడం గమనార్హం. స్థానికంగా ఉపాధి లేకపోవడం గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతం కావడంతో వలసదారుల సంఖ్య గతంలో కంటే ఎక్కువగా పెరిగింది. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తే వలస వెళ్లే కార్మికులకు ఎంపిక చేసుకున్న రంగాల్లో శిక్షణ ఇచ్చి సక్రమ మార్గాల్లో వీసాల జారీ, వలస వెళ్లడానికి ఆటంకాలు లేకుండా చేయడం జరుగుతుంది. వలస కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా ఉండటానికి అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని గల్ఫ్ బోర్డు ఏర్పాటు పై దృష్టి సరించాలని వలస కార్మికుల సంఘాలు కోరుతున్నాయి.

జిల్లాలో...

తెలంగాణలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుండి జీవనోపాధికై గల్ఫ్ వెళ్లిన వారు అనేకమంది ఉన్నారు. జిల్లా నుండి రెండు లక్షలకు పైగా గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలతో పాటు జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, ధర్పల్లి తదితర మండలాల నుండి గల్ఫ్ వెళ్లినవారు అనేకమంది ఉన్నారు.



గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వలస కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొని సంపాదించుకుంటున్నారు. దీంతో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి దేశానికి ఎంతో లాభాన్ని చేకూరుస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత అయినా గల్ఫ్ కార్మికుల సమస్యలు తీర్చాలి.

పొన్నాల విక్రమ్, బిసి ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షులు కువైట్

వలసకార్మికులను పట్టించుకోవాలి



వలస కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవాలి. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అర్థం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు సమన్వయం చేసుకొని వలస కార్మికుల కోసం కార్యాచరణ చేపట్టాలి.

బట్టు స్వామి, బిసి ఎన్ఆర్ఐ అధ్యక్షులు, కువైట్

కమ్మర్‌పల్లిలో 34,346 మంది ఓటర్లు

పురుషులు 15,936,
మహిళలు 18409
నేటి పోలింగ్ కు సర్వం సిద్ధం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 34,346 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 15,936, మహిళలు 18409 ఓటర్లు ఉన్నారు. మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీలతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని మానాల గ్రామంతో కలిపి 38 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 115 కేంద్రం నుండి 152 పోలింగ్ కేంద్రం వరకు పోలింగ్ కేంద్రాలు మండలంలో ఉన్నాయి. బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామ పరిధిలో నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 4868 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2342 మంది, మహిళలు 2526 మంది ఓటర్లు ఉన్నారు.

నేటి పోలింగ్ కు సర్వం సిద్ధం

మండలంలో నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని 38 పోలింగ్ కేంద్రాల్లో స్వచ్ఛగా శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించు కునేలా ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకొని పోలింగ్ శాతం పెరిగేందుకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-ఎడపల్లి

జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శంకర్ నాయక్ సోమవారం పరిశీలించారు. ఎన్నికల అధికారులకు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మంచి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులకు సిబ్బందికి స్థానిక ఓటర్లు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సహకరించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ఉందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట కార్యదర్శుల యూనియన్ అధ్యక్షులు ఉదయ భాస్కర్, రవి ప్రకాష్‌రెడ్డి, పద్మావతి, తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పోలీస్ బలగాల మోహరింపు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని పోలీసు బలగాలను రప్పించినట్లు డిఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలానికి డిఎస్పీ, సిఐ, ఇద్దరు ఎస్సైలు, 30 మంది కేంద్ర బలగాలను, మరో 50 మంది రాష్ట్ర పోలీస్ బలగాలను మోహరింప చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాలలో కేంద్ర బలగాలను మొహరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఈ.సాయన్న కోరారు.

గ్రామాల్లో జోరుగా బెట్టింగులు

నవతెలంగాణ-మోపాల్



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతుండడంతో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థుల భవిత్యం ఓటరు చేతిలో ఉండడంతో గెలుపు అవకాశాలపై జోరుగా బెట్టింగ్ సాగుతుంది. ఒక దిక్కున ఐపీఎల్ బెట్టింగులైతే మరో దిక్కున ఎన్నికల బెట్టింగ్ ప్రధానంగా పోటీ తీవ్రంగా ఉన్న నిజామాబాద్ ఎంపీ నియోజకవర్గంలో రూ.లక్షల్లో బెట్టింగులకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బుకీలు లేకపోయినప్పటికీ స్థానికంగా బెట్టింగులు కాస్తున్నారు. గ్రామాల్లో కొందరు ఆ పందేలకు తెరతీసినట్లు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల్లో రూ.5000నుంచి రూ.20000 మధ్య ఓట్లతో గెలిచే అవకాశాలు ఉండటంతో అభ్యర్థుల గెలుపు పై బెట్టింగ్ వేసినవారికి ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో బెట్టింగ్ స్థలాలు రచ్చబండలు, చాయ్ హోటల్లు ఆయస్థానాల్లో కూర్చుండి మా పార్టీ అభ్యర్థి గెలుస్తారంటే మా పార్టీ అభ్యర్థి గెలుస్తారు అంటూ బెట్టింగులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి బిజెపి అభ్యర్థి అరవింద్ మధ్య ఉంటుందని సమాచారం. ఉత్కంఠకు తెరదించాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటు వేయడానికి వెళ్ళేటప్పుడు ఓటరు కార్డు మాత్రమే వెంట తీసుకెళ్లాలని ఏసీపి బస్వా రెడ్డి, ఎస్ హెచ్ఓ రవికుమార్, వేల్పూర్ ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. బూత్‌లోనికి వాటర్ బాటిల్ , సిగరెట్లు, సెల్‌ఫోన్‌లను, అగ్గిపెట్టె మరే ఇతర వస్తువులను తమ వెంట తీసుకుని వెళ్లరాదని అన్నారు. పోలింగ్ స్టేషన్‌కి 100 మీటర్లు, 200 మీటర్ల దూరంలో ఎక్కడ కూడా ప్రజలు గుమి గూడడం, టెంట్లు వేసుకుని ఉండడం లాంటివి చేయవద్దని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరంలో నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

పోలీస్ సిబ్బందికి ప్రజలు సహకరించాలి

ఎస్సై వంశీకృష్ణారెడ్డి

నవతెలంగాణ -ఎడపల్లి

మండలంలో నేడు జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల ప్రజాప్రతినిధులు అధికారులు యువకులు నాయకులు పోలీస్ అధికారులకు సిబ్బందికి సహకరించాలని ఎస్సై వంశీకృష్ణారెడ్డి కోరారు. తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. పోలీస్ యాక్ట్ ప్రకారం పోలీస్ అధికారులకు ఎన్నికల సిబ్బందికి సహకరించకపోతే ఎన్నికల నియమ నిబంధన చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

గ్రామాల్లో తనిఖీలు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలుసుకొని అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. డబ్బులు పంచుతున్నారని సమాచారం అందడంతో ఫ్లైన్స్ స్కాడ్ ఎంపీడీఓ క్రాంతి, సిఐ సతీష్ సిబ్బందితో పలు వీధుల్లో తనిఖీలు చేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-రెంజల్

మండలంలో నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో 12 గ్రామపంచాయతీల పరిధిలో 29, 358 మంది తమ ఓటు హక్కున సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులు తెలియజేశారు. మండలంలో 14,065 మంది పురుషులు, 152 మంది మహిళలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారని వారు పేర్కొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

ఎన్నికల సాధారణ పరిశీలకురాలు

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఐఏఎస్ అధికారిణి అలియావిజ్ పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయిన ఉద్యోగులు రిపోర్ట్ చేయడం, గైర్హాజరయిన వారి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలతో విధులకు బయలుదేరిన వాహనాలకు ఎస్కార్ట్‌ను పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య, పోలీంగ్‌బూత్‌ల సంఖ్య, సమస్యాత్మక పోలీంగ్ కేంద్రాల గురించి ఆమే రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంద శాతం పోలీంగ్ నమోదు అయ్యేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమే వెంట ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్

బోధన్ నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీఓ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఆదివారం బోధన్ విజయమేరి హైస్కూల్‌లో ఎన్నికల సామాగ్రి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులలో పాల్గొన్న సిబ్బందికి పలు సూచనలు అందించారు. బోధన్ నియోజకవర్గంలో 246 పోలీంగ్ స్టేషన్‌లలో 24 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు సెక్టోరియల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. అలాగే 1200 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓట్టింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఓటర్లు ఓటు వేయడానికి 13 రకాల గుర్తింపు కార్డులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,23,906 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ గంగాధర్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

ఓటుతోనే భవిత

గోధుమ రవ్వతో భారతదేశ పటం



నవతెలంగాణ-మద్నూర్

ఓటుతోనే దేశ భవిష్యత్తు ఉందని చాటి చెప్పేందుకు కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు కర్రేవార్ పండరి గోధుమ రవ్వతో భారతదేశం పటం వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకో వాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని గోధుమ రవ్వతో చిత్రం ద్వారా ఓటర్లకు వివరించారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వినూత్నంగా చిత్రం గీసిన పండరిని గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

పీహెచ్‌డీ పట్టా పొందిన లింగంపేట్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను స్థానికులు ఆదివారం సన్మానించారు. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన బాలరాజు రాజారాం రూరల్ డెవలప్‌మెంట్‌పై అంశంపై పీహెచ్‌డీ పట్టా పొందగా, అదేవిధంగా మండల కేంద్రంలో చెందిన కడారి దేవరాజు సైతం పీహెచ్‌డీ పొందగా ఇద్దరిని తోటి మిత్రులు, గ్రామస్తులు సన్మానించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేపూరి వంశీ నారాయణ శ్రీనివాస్ రమేష్ సురేష్ సందీప్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న స్నేహితులు, స్థానికులు

తరుగు, తూకంలో మోసం చేస్తే కేసులు

- కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ఐకేపీ నిర్వహకుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలంలోని ఖండేబల్లూరు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో మోసాలకు పాల్పడితే ఎంతటి వారినైన వదిలే ప్రసక్తే లేదని, మోసాలకు పాల్పడే అలాంటి వారి పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మాయిశ్చర్ విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు, కనీస మద్దతు ధర, తూకాల గురించి ఎమ్మెల్యే రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు తాము తీసుకు వచ్చిన ధాన్యంలో తాలు పేరుతో ధాన్యం తగ్గిస్తున్నారని, మాయిశ్చర్ ప్రతి రోజూ చూడడం లేదని చెప్పారు. బస్తాకు నాలుగు రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రశ్నించిన వారిని బూతులు తిడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

వెంటనే ఐకెపి నిర్వాహకుడికి ఫోన్ చేసి ఈ విషయం గురించి అడగగా నిర్లక్ష్య ంగ సమాధానమి వ్వడంతో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అతనిని వెంటనే సస్పెండ్ చేసి రైతులను తరుగు పేరుతో మోసం చేయడమే గాక బూతులు తిట్టినందుకు గానూ కేసు నమోదు చేయాలని పై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఐకెపి కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యంలో తాలు పేరుతో తూకం తగ్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సౌకర్యంతో పాటు టెంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై ఐకేపీ సెంటర్ నిర్వహకుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పకడ్బంధీ ఏర్పాట్లు చేసినట్లు జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఆదివారం పోలింగ్ సామాగ్రితో సిబ్బందినీ పోలింగ్ కేంద్రాలకు తరలించే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించారు.

ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. జుక్కల్ నియోజకవర్గంలో 255 పోలింగ్ స్టేషన్లో ఓటింగ్ జరుగుతుందని దానికి సంబంధించిన అవసరం మేరకు పోలింగ్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ఓట్లు వేయాలని కోరారు. ఈ ఎన్నికలకు ప్రజలంతా సహకరించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం 255 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,02,887, వీటి పరిధిలో మహిళల ఓటర్ల సంఖ్య 1,03,354, పురుషుల ఓటర్ల సంఖ్య 99,524 ఉన్నట్లు జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆదర్శ పాఠశాల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంకు గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాయిబాబా తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 31వ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఎంపీసీ, బైపీసీ, సిఇసి, ఎంఈసి ప్రతి గ్రూపులో 40 సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ఆర్యవైశ్య భవనంలో ఆదివారం నంగునూరి మాణిక్యం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 జంటలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు.

ఘనంగా గంగమ్మ పండుగ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం గంగమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కల్వరాల్, పద్మాజివాడి గంగపుత్రులు బ్యాండ్ మేళాతో బోనాలను మహిళలు ఊరేగింపుగా ఇరుగ్రామల గంగపుత్రులు గంగమ్మ ఆలయం వరకు తీసికవేళ్ళారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధాన్యం తడవకుండా చూడండి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యం రాశులు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. ఆదివారం తన ఛాంబర్ లో జిల్లా సహకార, పౌరసరఫరాల అదికారులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు, ఉప తహసీల్దార్‌లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లను వేగవంతం చేస్తూ కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాల నుండి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించవలసిందిగా పౌర సరఫరాల ఉప తహసిల్దార్లను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు జిల్లా మేనేజర్ నిత్యానందం ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్, డిప్యూటీ తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మాచారెడ్డి మండలం లచ్చపేటలోని ఆగ్రో రైస్ మిల్లును సందర్శించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు తూకం వేసి తరలించుటకు సిద్ధంగా ఉన్నందున ప్రతిరోజు పది లారీలకు తగ్గకుండా ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు.





అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- తరలిన పోలింగ్ సామగ్రి, సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి/లింగపేట్/మద్నూర్/రామారెడ్డి

సోమవారం జహీరాబాద్ పార్లమెంటు నియోజక వర్గానికి జరగనున్న పోలింగ్‌కు సిబ్బంది డిస్ట్రిబ్యూటిషన్ కేంద్రం నుండి పోలింగ్ మెటీరియల్స్ తో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రూటు వారీగా పోలింగ్ సిబ్బందికి ఈవీఎం లు, ఎన్నికల సామాగ్రి అందజేత ప్రక్రియను పరిశిలిస్తూ చెక్ లిస్ట్ ప్రకారం మెటీరియల్ సరిగ్గా చూసుకోవాలని అన్నారు. మేఘావృత్తమై వర్షం పడే సూచనలునందున పోలింగ్ సిబ్బందిని 27 రూట్ల ద్వారా 27 బస్సులలో నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రెసిడింగ్ అధికారి మార్గదర్శాకలను ఆకళింపుచేసుకొని నేటి రాత్రే సీటింగ్, కంపార్ట్మెంట్ ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, సోమవారం ఉదయం 5. 30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, క్లియర్ చేయాలని సూచించారు. సరిగ్గా ఉదయం 7.00 పోలింగ్ ప్రారంభించాలని, ఎటువంటి చిన్న సంఘటనకు, పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈవీఎంల సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే రీప్లేస్ చేయుటకు సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రంగనాథరావు, మునిసిపల్ కమీషనర్ సుజాత తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

లింగంపేట్ : సోమవారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంద. అందుకుగాను ఎన్నికల ఏర్పాట్లు సంబంధిత ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. లింగంపేట మండలంలో 42 పోలింగ్ కేంద్రాల గాను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు పోలింగ్ కేంద్రాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున మొత్తం172 సిబ్బందిని ఏర్పాటు చేశారు సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకొని ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్ర పనుల్లో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించారు ఎండలు తీవ్రంగా ఉన్నట్లయితే ఓటర్లకు నీడ సౌకర్యం కల్పించాలని తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల ఆదేశించారు ఆదేశానుసారం పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంలో అధికారులు నిమగ్నమయ్యారు అంతే కకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కేంద్ర పోలీస్ పోలీస్ బలగాలు లింగంపేట్ మండలానికి చేరుకు న్నాయి. మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ప్రారంభయే పోలింగ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.

మద్నూర్ : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం నిర్వహించే పోలింగ్‌కు ఎన్నికల సిబ్బంది మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర) నుంచి ఎన్నికల సామాగ్రి వెంట తీసుకువెళ్ళారు.

పోలింగ్ కేంద్రాల్లో పాల్గొన్న సిబ్బంది 255 పోలింగ్ కేంద్రాలకు గాను 1275 మంది, అదనంగా మరో 80 (రిజర్వ్) సిబ్బంది, 26 రూట్‌లకు సెక్టారల్ ఆఫీసర్లు 26 మంది. పోలింగ్ కేంద్రాలకు 255 మంది. బూత్ లెవెల్ బిఎల్‌ఓలు అధికారులు, వారికి అసిస్టెంట్లుగా మరో 255 మంది ఏబిఎల్‌ఓలు, హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి 185 మంది. 26 టేబుల్స్‌కు 26 మంది. ఏఈవోలు, 255 మంది పోలీసు సిబ్బంది. మద్నూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ దగ్గర భద్రతగా మరో 10 మంది పోలీస్ సిబ్బంది. రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి (తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు, గిర్దవర్లు, సర్వేయర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, చైర్మన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వీఆర్ఏలు, జీపీ సిబ్బంది, 200 మంది వరకు, మొత్తం 2567 మంది పోలింగ్ సిబ్బంది. జుక్కల్ నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

రామారెడ్డి : మండలంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలతోపాటు, పోలింగ్ సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల వసతులను పరిశీలించి, ఓటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



పోలింగ్ ప్రక్రియ పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ హాల్



రామారెడ్డికి చేరిన సిబ్బంది



ఎన్నిక సామగ్రితో తరులుతూ..

ఈదురుగాలుల వర్షం

ఇబ్బంది పడ్డ ఎన్నికల సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం వీచిన ఈదురుగాలులు, వర్షానికి ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మైదానంలో అధికారులు ఈవీఎంలు, వివి ప్యాడ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం అనుకోకుండా ఇదురుగాలులతో కూడి వర్షం పడటంతో సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ పడిపోగా టెంట్ నుంచి నీళ్ల రావడంతో నిలబడడానికి సిబ్బంది తీరు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఫ్లెక్సీలు కప్పుకొని వర్షం పడకుండా జాగ్రత్త పడగా, కొందరు తమ సామాగ్రిని పట్టుకొని కళాశాల వరండాలోకి పరుగులు తీశారు. భారీ వర్షం కురవడంతో ఎన్నికల సామాగ్రిని డిస్ట్రిబ్యూట చేసేందుకు సిద్ధంగా ఉన్నా ఈవీఎంలు, వివి ప్యాడ్స్ కలవకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



వర్షానికి తడవకుండా ఫ్లెక్సీలను పట్టుకున్న సిబ్బంది



ఓటు హక్కే కాదు.. బాధ్యత కూడా

నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్

పోలింగ్ శాతం పెరిగేనా..?

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



75 వసంతాలు దాటిన ప్రజాస్వామ్యంలో పౌరులకు ఇంకా ఓటు హక్కు గురించి సరిగ్గా తెలియడం లేదని పలుచోట్ల అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే రుజువు అవుతుంది. కొంతమంది చదువుకున్న వ్యక్తులు కూడా చిన్నచిన్న సాకులతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓపికతో ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓటు వేయకపోతే ఏమవుతుంది, ఓటు హక్కు వినియోగించుకోకుంటే నాకేమీ నష్టం లేదు కదా అనుకుంటుంటారు. ప్రజాస్వామ్యానికి ఓటే ప్రధాన వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తెలుసుకోవాలి.

1932 సంవత్సరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బ్రిటిష్ వారితో పోరాడి ఓటు హక్కు అనే ఆయుధాన్ని కుల మత వర్గ లింగ బేధాలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కును కానుకగా అందించి మనల్ని పరిపాలించే నాయకుడిని మనమే ఎన్నుకునే అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని ప్రతి పౌరుడు సక్రమంగా ఉపయోగించుకోవాలి. సంఘటితంగా ఒక నాయకుని ఎన్నుకొని వ్యవస్థను నడిపించడానికి ఓటు వేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలి. ఓటర్లు చైతన్యవంతులుగా ఉన్నప్పుడే ప్రజా ప్రతినిధిగా ఉన్న నాయకునికి గుబులు పుట్టి సుపరిపాలన అందిస్తారు. 5సం.రాల కాలం పాటు మనల్ని పరిపాలించడానికి నీతి నిజాయితీ గల నిజమైన నాయకున్ని ఎన్నుకునే ఆయుధమే ఓటు అని గుర్తించాలి. సమాజంలో ఒక నాయకుడి ద్వారా మంచి జరిగినా చెడు జరిగిన అందుకు మనం కూడా భాగస్వాములమే ఎందుకంటే నీ ఓటు ద్వారానే ఆ నాయకుడు పరిపాలకుడిగా మారతాడు. ఆ ప్రభుత్వం నీ ఓటు ద్వారానే అధికారంలోకి వస్తుంది. ప్రతి పౌరుడు ఓటు వేయడం హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని ఓటు విలువ గురించి తెలుసుకోవాలి. 5 సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయించే ఓటును మద్యానికి, బిర్యానికి, డబ్బులకి, కానుకలకి, తాయిలాలకి అమ్ముకొని భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేయకుండా ప్రతి పౌరుడు ప్రజాస్వామ్య బాటను గెలిపించడానికి ఓటు వేస్తారని ఆశిస్తూ..

శోచయించు..

ఐదేండ్ల ఒక్కసారి ఎఎన్నికలు
జర శోచయించు ఓటరు
గత ప్రభుత్వాల పాలనను
చేయాలి మనం స్క్రీనింగ్
కులానికి తలొగ్గుతావేయో..
మతం మాయలో పడుతావేమో..
నోటుకు తలొగ్గుతావేయో..
మద్యానికి బానిసవుతావేమో..

జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై..

పెద్ద నోట్లు రద్దు చేసే
వృద్ధుల ప్రాణాలు తీసే
జీఎస్టీ తీసుకొచ్చే
పేదలపై భారాలు మోపే
హక్కులపై పోరాడితే
అన్నదాతపై తుటాలు పేల్చే..
గో రక్షణ పేరుతో
మైనార్టీలను హతమర్చే..
మణిపూర్ మంటల్లో తగలబడే
ప్రధాని మౌనంగా ఉండిపోయే
ప్రజాస్వామ్య దేశంలో
స్వేచ్ఛ, సమానత్వం
హక్కులు కాలరాసే..

జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై..

కరోనా కష్టాకాలంలో
శవాల గుట్టల సాక్షిగా



ఆకలితో ఆలమట్టించే
పేదోడీ సాక్షిగా
డిగ్రీ పట్టాలతో రోడ్డున
నిలిచిన నిరుద్యోగి సాక్షిగా
పాతాళానికి పాడిపోయిన
రూపాయి విలువ సాక్షిగా ..

జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై..

మళ్లీ ఆ మాయలో పడితే
దేశ భవిష్యత్ అధోగతే..
అందుకే జర శోచయించు..

ఐదేండ్ల ఒక్కసారి ఎఎన్నికలు
జర శోచయించు ఓటరు
గత ప్రభుత్వాల పాలనను
చేయాలి మనం స్క్రీనింగ్
కులానికి తలొగ్గుతావేయో..
మతం మాయలో పడుతావేమో..
నోటుకు తలొగ్గుతావేయో..
మద్యానికి బానిసవుతావేమో
జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై..
పెద్ద నోట్లు రద్దు చేసే
వృద్ధుల ప్రాణాలు తీసే
జీఎస్టీ తీసుకొచ్చే
పేదలపై భారాలు మోపే
హక్కులపై పోరాడితే
అన్నదాతపై తుటాలు పేల్చే..
గో రక్షణ పేరుతో
మైనార్టీలను హతమర్చే..
మణిపూర్ మంటల్లో తగలబడే
ప్రధాని మౌనంగా ఉండిపోయే
ప్రజాస్వామ్య దేశంలో
స్వేచ్ఛ, సమానత్వం
హక్కులు కాలరాసే
జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై..
కరోనా కష్టాకాలంలో
శవాల గుట్టల సాక్షిగా
ఆకలితో ఆలమట్టించే
పేదోడీ సాక్షిగా
డిగ్రీ పట్టాలతో రోడ్డున
పడ్డ నిరుద్యోగి సాక్షిగా
పాతాళానికి పాడిపోయిన
రూపాయి విలువ సాక్షిగా

జర శోచయించు ఓటరు
పదేండ్ల మనువాది పాలనపై...

మళ్లీ ఆ మాయలో పడితే
దేశ భవిష్యత్ అధోగతే..
అందుకే జర శోచయించు
ఓటు వేసే ముందు..
దేశ భవిష్యత్‌కు నీ ఓటు..
అన్నది మరచిపోకు..

-అజయ్ కుమార్

ధర్మోరా బాలికకు జిల్లా గంగపుత్ర సంఘం ప్రతిభ పురస్కారం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన పల్లికొండ స్పందనకు జిల్లా గంగపుత్ర సంఘం అధ్వర్యంలో ఆదివారం ప్రతిభ పురస్కారం అందజేశారు. 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా గంగపుత్ర సంఘం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పలువురు

నాగాపూర్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్

నవతెలంగాణ-బాల్కొండ

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని నాగపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని అక్కడి అధికారులు అన్ని సౌకర్యాలతో అత్యంత అందంగా తీర్చిదిద్దారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు కృషి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని వసతులతో మోడల్ పోలింగ్ స్టేషన్ గా ఏర్పాటు చేశామన్నారు.



ఓటు వేసేందుకు గుర్తింపుకార్డు తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటపుడు తమతో 13 రకాల కార్డులలో ఎదైనా ఒకటి గుర్తింపు కార్డు తమ వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఓటరు కార్డు, ఆధార్ కార్డు, ఎంఎస్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు, ఫోటోతో ఉన్న పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు ఇందులో ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లి ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

స్వీప్ ఆధ్వర్యంలో నిత్యం చైతన్యం

- పట్టణంలో ర్యాలీతో అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం పోలింగ్‌కు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ఆదివారం స్వీప్ ఆధ్వర్యంలో పట్టణంలోని వన్ టౌన్ సమీపంలోని డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ అనిత జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతిక కళాకారులు పాటల ద్వారా ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. పట్టణంలో తిరుగుతూ సోమవారం పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటేయ్యాలని కోరారు. అనంతరం అశోక్ రోడ్డులో వృద్ధ ఓటరును సత్కరించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు వంద శాతం పోలింగ్‌కు చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఓటరుగా నమోదై ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని కోరారు.

గాలివాన బీభత్సం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం పూసిగూడ, తాడిహత్నూర్, గాలివాన బీభత్సానికి మెయిన్ రోడ్డుపై చెట్లు విరిగి నేలకొరిగాయి. దీంతో నార్నూర్ వెళ్లే దారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. చాలా చోట్ల ఇండ్లలోని వర్షపు నీరు ప్రవేశించింది. చెట్లు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పోలింగ్ స్లిప్పులు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్, మావల మండల కేంద్రాల్లోని ఆయా గ్రామాల్లో పోలింగ్ స్లిప్పులను ఓటర్లకు బీఎల్‌ఓలు అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు మాట్లాడారు. ఓటు వేసేందుకు వచ్చేటపుడు ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ పుస్తకం, రేషన్ కార్డు వీటిలో ఎదైన ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాలని అన్నారు.

పోలింగ్ బందోబస్తు పూర్తి : ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు చేపట్టామని ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి, బందోబస్తు విధులు కేటాయించారు. రూట్ల వారీగా అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రూట్ మ్యాప్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రానికి ఓటర్లు వస్తారన్నారు. మగవారికి మహిళలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. నిషేధిత వస్తువులను లోనికి తీసుకెళ్లకుండా చూడాలన్నారు. అల్లర్లు సృష్టించేలా వాతావరణం కనిపిస్తే వెంటనే యాక్షన్ తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ అయితే అల్లర్లు జరిగాయో అక్కడ ప్రత్యేకంగా నిఘా పెంచాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ సురేందర్ రావ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, సీఐలు, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

నవతెలంగాణ-ఉట్నూర్

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మురళీధర్, గ్రామపంచాయతీ ఈఓ శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 73 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ప్రజలు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు తమ తమ బూత్‌ల వద్ద ఓట్లు ప్రశాంతమైన వాతావరణంలో వేసుకొని పోలింగ్ అధికారులకు సహకరించాలని కోరారు.

ఎన్నికల విధుల్లో ఒకే చోట ఎస్సై అన్నదమ్ములు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో ఈవీఎం మిషన్ల పంపిణీ ప్రక్రియ ఆదివారం చేపట్టారు. దీంట్లో భాగంగా ఆయా మండల పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సీఐలు విధుల నిర్వహణలో భాగంగా అక్కడికి వచ్చారు. అయితే ఎన్నికల విధుల్లో ఇద్దరు ఎస్సైలు పాల్గొనగా, వారిద్దరూ అన్నదమ్ములు అవ్వడం విశేషమైంది. మావల పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్, జైనథ్ పోలీస్ స్టేషన్ ఎస్సై పురుషోత్తం ఇక్కడే విధులు నిర్వర్తించారు. ఎన్నికల విధుల్లో భాగంగా వారిద్దరూ ఒకేచోట కనిపించడంతో కాసేపు ముచ్చటించారు.

నిరుపయోగంగా విద్యా వనరుల భవనం

- వ్యసనపరులకు అడ్డాగా మారిన వైనం

నవతెలంగాణ - మెండోర

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మండలాల విభజనలో భాగంగా బాల్కొండ మండలం నుండి ముప్కాల్, మెండోర రెండు నూతన మండలాలుగా విభజించబడ్డాయి. పోలీస్ స్టేషన్, మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు, వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యాలయాల విభజన వెంటనే జరిగిపోయింది. కానీ సంవత్సరాలు గడుస్తున్నా విద్యాశాఖ విభజనకు ఇంతవరకూ నోచుకోలేదు. మండల కేంద్రంలో విద్యా వనరుల భవనం లక్షల రూపాయలతో నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేకపోవడంతో పొదలు పెరిగి చెడు వ్యసనాలకు అడ్డాగా మారింది.

మండలం విభజన అయిన తరువాత మండల పరిషత్ కార్యాలయం పాఠశాల భవనాల్లో , పోలీస్ స్టేషన్ ప్రభుత్వ ఆసుపత్రి లో , వ్యవసాయ శాఖ కార్యాలయం రైతు వేదికలో చాలీ చాలని వసతులతో నెట్టుకొస్తుండగా , మండల రెవెన్యూ కార్యాలయం తో సహా కేజీబీవి పాఠశాల సైతం అద్దె భవనాలలో అతి కష్టం మీద కొనసాగుతున్నాయి. కానీ ఇప్పటివరకు విభజన ప్రక్రియ జరగని విద్యాశాఖ కు మాత్రం లక్షల రూపాయలు వెచ్చించి మండల కేంద్రంలో నూతన విద్యా వనరుల కేంద్ర భవనం నిర్మాణం చేశారు. ఈనూతన భవనం గచ్చ పొదలు పేరుకుపోయి నిరుపయోగంగా మారింది. వ్యసనపరులకు అడ్డాగా మారుతోంది అని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యా వనరుల కేంద్రం ఊరు చివరన ఉండటంతో మద్యపానం, ధూమపానం చేయడంతో పాటు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఉపయోగించుకుంటున్నారు. అధికారులు మాత్రం అటువైపు చూడకుండా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇందుకు కారణం విద్యా శాఖ విభజన కు నోచుకోకపోవడమే కారణమంటూ కొందరు అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న విద్యా వనరుల అభివృద్ధి కేంద్ర భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఏరియా ఆసుపత్రిలో నర్సుల దినోత్సవ సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటర్నేషనల్ నర్సింగ్ డే సందర్భంగా గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రిలో ఆదివారం నర్సుల దినోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్ నర్సుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కాంపౌడర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నర్సింగ్ సిబ్బంది సీనియర్ స్టాఫ్ హాస్పిటల్ నర్సింగ్ స్టాఫ్ అందరిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డ్యూటీ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ నర్సింగ్ సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో కాంపౌండర్స్ అసోసియేషన్ సభ్యులు చందన హాస్పిటల్ గణేష్, ఆశ హాస్పిటల్ అజయ్ , సచిన్, కిరణ్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నర్సుల దినోత్సవం జరుపుకుంటున్న సిబ్బంది

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కామారెడ్డి

బిక్కనూర్ మండలం తిప్పాపూర్, పాల్వంచ మండలం పరిధిపేట్, మాచారెడ్డి మండలం లచ్చపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు సందర్శించారు. భిక్కనూర్ మండలం తిప్పాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మమేకమయ్యారు. అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని ఇన్చార్జిని ఆదేశించారు. తిప్పాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి 2 లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ను ఆదేశించారు. పాల్వంచ మండలం పరిది పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికంగా ధాన్యం కుప్పలు ఉన్నందున 10 లారీలను పంపించాలని సూచించారు. మాచారెడ్డి మండలం లచ్చపేట కొనుగోలు కేంద్రంలో 900 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని పంపేందుకు లారీని ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో తాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. పల్వాంచ మండలం పరిధిపేటలోని సాయి మణికంఠ రైస్ మిల్లును సందర్శించారు. రైస్ మిల్ యజమానితో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే అన్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్లు కిష్టయ్య శ్రీనివాస్, సహకార సంఘాల కార్య నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు

కానరాని ఎన్నికల నిబంధనలు



ఒకచోట గుమిగూడిన జనం

నవతెలంగాణ-దోమకొండ

ఈ నెల 13న లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ 11 వ తేది సాయంత్రం 7 గంటల నుండి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం 144 సెక్షన్ అమలులో ఉంది. కానీ దోమకొండ మండలంలో 144వ సెక్షన్ అమలులో ఉన్నట్టు లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమకొండ గ్రామ పంచాయతీ ప్రాంతంలో ప్రధాన కూడలి వద్ద జనం గుమికూడినా పోలీసులు, అధికార యంత్రాంగం పట్టించుకోలేదని అంటున్నారు.

ఓ పాజిటివ్ రక్తం అందజేత

- గుండె ఆపరేషన్ నిమిత్తం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఆర్య వైశ్య సంఘం పిఆర్‌ఓ కొమురవెల్లి వేణుగోపాల్‌కు హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండె ఆపరేషన్ నిమిత్తమై ఓ పాజిటివ్ రక్తం అవసరమని వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను సంప్రదించారు. వారికి కావలసిన రక్తాన్ని ఐవిఎఫ్ సభ్యులు కాటేదాన్‌కు చెందిన ఓరుగంటి మల్లేష్ వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేశారని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన ఐవిఎఫ్ సభ్యులు ఓరుగంటి మల్లేష్‌కు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్, ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందనలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి కావాల్సిన రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్న అత్యవసరంగా రక్తం అవసరం ఉన్నవారు 9492874006 నంబర్ కి సంప్రదించాలని అన్నారు.



స్నేహపురి కాలనీలో యోగ శిబిరం




యోగా శిబిరాన్ని ప్రారంబించిన దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

యోగి రాజు గురు కేశవ్ ఉపాధ్యాయ నేపాల్, కుసుమ్ సునర్ టీం ఆపరేటర్ నేపాల్ కామారెడ్డి పట్టణంలోని స్నేహపురి కాలనీ పార్కులో యోగ శిబిరం, చికిత్స కేంద్రం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగి రాజ్ గురు కేశవ్ ఉపాధ్యాయ, స్నేహపురి కాలనీ పార్క్ అధ్యక్షులు గ్యార సాయిలు మాట్లాడుతూ.. మెడ నొప్పి. నడుమునొప్పి. కీళ్లనొప్పి. సంధివాతం. పక్షవాతం, పిట్స్, సొరియాసిస్ బిపి, షుగర్, కంటిసమస్యలు, గర్భాశయ వ్యాధులు, సంతానంకోసం ప్రైవేట్ హాస్పిటళ్లలో వేలకు వేలు డబ్బులు పెట్టుకొని ఖర్చు పెట్టుకుంటారని అన్నారు. ఎలాంటి సమస్యలైనా యోగాద్వారా తగ్గించుకోవచ్చని చెప్పారు. ఫీజు కేవలం 500 -రూపాయలు మాత్రమే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కుసుమ్ సునార్, సాలిక్ గ్రామ్, ప్రేమ్ రాజు, వసుంధర సుధాకర్ రెడ్డి, ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి రమేష్, బాలరాజు, మారుతి, నాగేందర్ పాల్గొన్నారు.

మేము ఓటేస్తున్నాం.. మీరు వేయాలి : కలెక్టర్

- ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని.. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రతి పౌరుడు 13న బాధ్యతగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ముఖ్యమైందని అన్నారు. జిల్లా ఎస్పీ, తాను కూడా ఇక్కడే ఓటేస్తున్నామని, ప్రజలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని సూచించారు. ఆదివారం పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను సందర్శించారు. అక్కడ పీవో, ఏపీవోలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఆర్డీఓ వినోద్ కుమార్‌కు రిపోర్టు చేస్తు సామాగ్రిని తీసుకున్నారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 598 పోలింగ్ కేంద్రాలకు 2వేల 868 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామని అన్నారు. వారందరికి ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఈవీఎంల పని తీరుతో పాటు మాక్ పోలింగ్ నిర్వహరణపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో వారికి కేటాయించిన రూట్లకు బయలుదేరి వెళ్లారు.

నేడే పోలింగ్ ఏర్పాట్లు పూర్తి..

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల అధికారులు వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకునే లోపు ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఓటర్లకు తాగునీరు, టెంట్లు ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. రెండు మూడు రోజులుగా జిల్లాలో నెలకొన్న మేఘావృత వాతావరణం, వర్షసూచనల నేపథ్యంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గత పార్లమెంటు ఎన్నికల్లో జిల్లాలో 77.9 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి మరింతగా పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎండల తీవ్రత కారణంగా పోలింగ్ సమయాన్ని గంటపాటు పెంచుతూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు.

పిడుగు పాటుకు ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-ఉట్నూర్

పిడుగు పాటుకు ఎద్దు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని లింగోజీ తాండలోని పెర్కగూడలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితరైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోట గంగన్నకు చెందిన ఎద్దు చేను నుంచి ఇంటికి వస్తుండగా శనివారం రాత్రి పిడుగు పడి ఎద్దు మృత్యువాత పడింది. ఎద్దు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

నేడే పోలింగ్

- ఇంటర్ గురుకుల కళాశాల వద్ద సందడి

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని కేబి కంప్లెక్స్‌లో ఇంటర్ గురుకుల కళాశాల వద్ద ఎన్నికల అధికారులు, సిబ్బంది భారీ సంఖ్యలో హాజరుకావడంతో ఇంటర్ గురుకుల కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, ఎన్నికల సిబ్బంది కార్యాలయానికి తరలివచ్చారు. వారికీ అధికారులు ఎన్నికలపై అవగాహన కల్పించి, అనంతరం వారికి ఈవీఎం మిషన్లను, ఎన్నికల సామాగ్రిని అందజేశారు.

ఆర్టీసీ విచారణ ఫోన్ నెంబర్ ఎర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్, ఉట్నూర్ బస్‌స్టేషన్‌లలో విచారణ సెల్ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆదిలాబాద్ బస్సుల వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్ 8331033707, ఉట్నూర్ 7382840047 ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని మేనేజర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.